# లక్కపిడతలు

ప్రకాశరావుకి ఆకలి వేసింది. అలా ఆకలి వేయడం ఆ పూటే కాదు. రోజుకు వుండే మూడుపూటలు కూడా! మూడు రోజుల్నుంచీ అదే స్థితి అయినా ముప్ఫై రోజులయినట్టుగా వుంది. జీవితం మీద విసుగ్గా వుంది. కూతురు పురిటికని వెళ్ళిన జయ ఇంకా రాకపోవడం మరీ కోపంగా వుంది. అలా కోపగించుకోవడం ఎంతైనా భర్తగా తనకున్న హక్కుగా, అజమాయిషీగా వుంది.

ప్రకాశరావుకి అన్నం వండుదామని అనిపించింది. కాని ఇంత వరకూ పొయ్యి ముట్టించుకొని చెయ్యికాల్చుకునే అనుభవం లేదే అనిపించింది. దాదాపు యాభై ఏళ్ళు గడిచిపోతున్నా అలాంటి అవసరమెప్పుడూరాలేదు. చిన్నప్పట్నుంచి అందరిళ్ళల్లో ఆడవాళ్ళలాగే వంటా వార్పు అమ్మదే. అదవా ఎప్పుడన్నా జబ్బుచేస్తే నాయినమ్మో అమ్మమ్మో వచ్చేదాక అక్కోచెల్లో అవన్నీ చూసుకునేవారు. చదువుకొనే కాలంలో హాస్టల్ కుక్ ఆ పాత్ర నిర్వహించేవాడు. సెలవుల్లో షిఫ్టు తీసుకున్నట్టుగా రెడీగా హోటల్స్ వుండేవి. ఉద్యోగం పెళ్ళీ ఒకేసారి .... తరువాత జయ శాశ్వత భాగస్వామిలాగే శాశ్వతమైన ఆ పాత్ర పోషించి ఇలాంటి అవసరం ... ఇదిగో ఇప్పుడు తప్పితే రానివ్వలేదు.

'అంచేత నేనిప్పుడు వండుకున్నా అన్నం ముద్దయిపోతుంది. లేదూ అంటే అడుగు అంటుకుపోయి మాడిపోతుంది. అలాంటిది తినలేము, తిన్నా వాంతి వస్తుంది. అంచేత నాకు వంటరాదు' అని తనని తను సమర్థించుకున్నాడు ప్రకాశరావు. అలా సమర్థించుకున్నాక తనకిక వంటగదిలో పనిలేదని బయటకు రాబోయాడు. ఈగలు ఝుమ్మన్నాయి. ఎంగిలి కంచాల్లోని మెతుకులు ఎండిపోయున్నాయి. కూర చారు

తపేలాలు కంపుగొడుతూ డాగులుదేరి వున్నాయి. వాటిని కడగాలని తోమాలని రెండ్రోజులుగా అనుకున్నాడు. బద్దకం ఆ పనిని చెయ్యనివ్వలేదు. పైగా తనకి తోమడం కూడా రాదుగా!

జయ వెళ్ళిన రోజు వేకువన మూడుగంటలకే లేచి ఆరుగంటలకల్లా అన్నమూ కూర చారు అన్నీ సిద్ధం చేసింది. చెయ్యికాపని పూరీలు చేసి కేరియర్‌లో వుంచింది. అంతకు ముందురోజే గోంగూర పచ్చడి చేసి సీసాలోకి ఎత్తింది. ఊరగాయి, టమాటా పచ్చడి నిలవాగా ఎప్పుడూ వున్నవే! ..... వీటన్నిటితో వారం రోజులు కళ్ళు ముయ్యండి, వచ్చి వాలుతాను అని సులువుగానే చెప్పింది. కాకపోతే ఆవిడ వంటకాలు ఎన్ని రోజులు వస్తాయి? రోజుకు ఎన్ని పూటలు?... అసలు అన్నం నిలవా వుంటుందా? ఆడవాళ్ళకి ఆ మాత్రం జ్ఞానం వుండదా? ఈ అంట్ల గురించి ఒక్క ముక్కా చెప్పకుండా వెళ్ళిందే!

పనిమనిషి రాలేదు. కాదు పనిమనిషి అంటూ లేదు. జయే అన్నీ చేసుకునేది కాబట్టి ఆ అవసరం రాలేదు. వెళ్ళేముందర పనిమనిషిని పెట్టొద్దూ? ఎంత కాదనుకున్నా జయదే తప్పుగా లోపంగా తోచింది ప్రకాశరావుకి.

అంట్లు దగ్గరికి వెళ్ళాడు. చెయ్యిపెట్టడానికే అసహ్యమనిపించింది. మూడ్రోజులకే ఇలాగైతే ఇంకోవారం?... బాబోయ్ లాభం లేదు. అందుకనే ప్రకాశరావు ఓ నిశ్చయానికి వచ్చాడు. ఆ అంట్లన్నింటిని అలాగే వదిలి వంటగది తలుపువేసాడు. పరిష్కారం దొరికిందనిపించింది. ఎందుకంటే తలుపులు తీస్తేగాని ఏ కంపూ రాదుగా!

ముందుగదిలోకి వచ్చి ప్రకాశరావు కూర్చున్నాడు. కుర్చీలోనే వెనక్కి చేరగిలబడ్డాడు. క్షణాల్లోనే లేచి మంచం మీద దొర్లాడు. అలా దొర్లాక ఆకలివున్నా లేవబుద్ధి అయ్యిందికాదు. అదే సమయానికి పొరిగింటి సుబ్బారావు కొడుకు వెంకటి గుర్తుకు వచ్చాడు. గుర్తుకు రావడమే కాదు మనిషీ వచ్చాడు.

"అంకుల్ ... మే ఐ హెల్ప్‌యూ?" అడిగాడు.

కుర్రాడు బుద్ధిమంతుడు అనుకున్నాడు ప్రకాశరావు. అలా అనుకున్నాక హోటల్ నుండి కేరియరయితే కడుక్కోవాలని, అందుకు జయ కూడా లేదని .... అంచేత ఏదో ఒకటి తెచ్చిపెట్టమని డబ్బులు ఇచ్చాడు. 'కేరియర్' అన్నాడా కుర్రాడు. అతిజాగ్రత్తపరుడై "పార్శిల్ ...పేక్ చేస్తాడ్లే..." ప్రకాశరావు చెప్పాడు.

కుర్రాడు వెళ్ళాక, మళ్ళీ వెనక్కి వాలిపోయాడు ప్రకాశరావు. అతనికి కాళ్ళుపీకాయి. జయ జ్ఞాపకానికొచ్చింది. జయ వేగిరం వచ్చేస్తే బాగున్ననిపించింది. ఆ సమయంలో

అతని రెండోకూతురు గుర్తుకు వచ్చింది. ఆమెకు రెండు దఫాలు పురుడూ పున్నెం ఇక్కడే జరిగాయి కాబట్టి అప్పుడు ప్రకాశరావుకి ఏ ఇబ్బందీ రాలేదు. పైగా ఇద్దరు కోడళ్ళూ ఆ సమయానికి వచ్చారు. 'లోకరివాజు కదా అమ్మాయి నిక్కడికే పంపెయ్యి' అంటే అల్లుడు మొహమాటపడ్డాడు. ఆ మొహమాటం మొహమాటం కాదు. 'ఇద్దరు చాలు ఆపరేషను చేయించుకో' అంటే - 'ఆడపిల్లలు గదా, మరో ఛాన్సు చూద్దాం ... మగపిల్లాడికోసం' అని అల్లుడు తనమాటే కానిచ్చుకున్నాడు. వద్దంటే రావద్దన్నట్టే భావించాడేమో-ఇన్నాళ్ళూ హైదరాబాదు ఆసుపత్రుల్లో బోలెడు ఖర్చు (అక్కడికేదో విశాఖపట్నంలో తక్కువయినట్లు )... అన్నవాడు 'ఇక్కడయితే అన్ని సదుపాయాలూ' అని సమాధానమిచ్చేడు. అదీ ఉత్తరంలో. పిల్ల నెలతప్పిన రోజునుంచి నెలలు లెక్కపెట్టి కాన్పు సమయం దగ్గరపడిందని ప్రకాశరావుకి దూరమయింది జయ.

ప్రకాశరావు కూడా పెళ్ళాంతో బాటే బయలుదేరబోయాడు. పాడులోకం అడ్డేసింది. అడ్డుకోవడం అంటే డైరెక్టుగా కాదు. దొంగతనంగా ... అవును ఇప్పుడు ఎక్కడ చూసినా దొంగ భయాలే. ఇంట్లో వున్నా తాళం వేసుకోవాల్సిన, వేసుకుంటున్న రోజులు. అలాంటిది ఇల్లొదిలి.... ఊరొదిలితే ఇంకేమన్నా వుందా? ఏమీవుండదు. చివరికి తాళం కప్పకూడా! అంచేత పేలస్ కాపుకి ఎవరో ఒకరు వుండాలి. ఎవర్ని నమ్మలేం.. నమ్మి అప్పజెప్పలేం ... మరలాంటప్పుడు ఎవరో ఒకరు వుండిపోవాలి. ఎవరో ఒకరే వెళ్ళాలి. కాన్పు సమయం కాబట్టి చెయ్యిసాయం, వంట సాయం అన్నీ చూస్తుంది కాబట్టి జయ బయల్దేరి వెళ్ళింది. "పదకొండు రోజుల నీళ్ళయిన వెంటనే నేను వచ్చేస్తాను మీరు అప్పుడు మనవడ్నో మనవరాల్నో చూడ్డానికి వెళ్దురు" అనేసి ప్రయాణమయింది. ఇన్ని కష్టాల్లో వదిలి మరీ.... అనుకున్నాడు ప్రకాశరావు.

వెంకటి కేరియర్‌తో వచ్చాడు.

"సమయానికి వచ్చావు. తెచ్చావు ..... " ప్రకాశరావు మాట నోటిలోనే వుంది, ఆ అబ్బాయి అన్నాడు "జయపిన్ని వెళ్తూ వెళ్తూ మరీ మరీ చెప్పింది." అందుకనే వచ్చినట్లు లేకపోతే రానట్టు.

జయ అలా చెప్పి వెళ్ళినందుకు సంతోషం కంటే ఎదురుగా కేరియర్ కనిపించేసరికి బాధే అనిపించింది ప్రకాశరావుకి.

"జయ కేరియర్ కూడా ఇచ్చిందా!"

"లేదండి ... ఇది మా కేరియర్. పార్శిల్ ఎందుకని మా అమ్మ కేరియర్ ఇచ్చి పంపింది, ఫరవాలేదు, తిన్నాక వదిలెయ్యండి .... మా ఇంట్లో ఆడవాళ్ళున్నారుగా తోముతారు."

మనసు తెలుసుకున్నందుకేమో మంచాడే అని మరోసారి అనుకున్నాడు ప్రకాశరావు. చెయ్యి కడుక్కోకుండా తిన్నాసరే, తినేసాక మాత్రం చెయ్యికడుక్కోవడం మర్చిపోలేదు. "పరవాలేదు.... నేకడుగుతాగ పరవాలేదు" అంటూనే వెంకటికి ఖాళీ కేరియర్ ఇచ్చాడు.

ఆ అబ్బాయి వెళ్ళాక టీ.వీ చూస్తూ చూస్తూ నిద్రపోయాడు ప్రకాశరావు. తెలివి వచ్చేసరికి తెల్లారిపోయినట్టనిపించి బ్రష్షు పేస్టు అందివ్వవలసిన జయ గుర్తుకొచ్చి... వెళ్ళి నాల్రోజులయిపోయిందని తెగ బాధపడుతున్న సమయంలో 'హైదరాబాద్ దూరదర్శన్ ... సాయంత్రం కార్యక్రమాలు ...' అంటూ టీవి చెప్పేదాక సాయంత్రమయిందని తెలియలేదు.

అది సాయంత్రం అవడం వల్ల బ్రష్షయితే అవసరంలేదు కాని టీ కావాల్సి వచ్చింది. మళ్ళీ జయ మీద కోపం వచ్చేదే, కాని ఎదురింటి నాయుడి పిల్ల 'చిన తాతా కాఫీ' అంటూ టీ అందిచ్చాక, అది తాగేక జయ గుర్తుకు రాలేదు. ముఖం కడుక్కొని వీధి బజారు రోడ్లు, వాటి చుట్టుకొలత చూసి, ఆలిసాక ఆకలేసాక హోటల్లో తిని ఇంటి దగ్గరే పడుకున్నాడు.

రాత్రి చీకట్లో కరిగిపోయి, తెల్లవారింది. ప్రకాశం నిద్రలేచాడు. వంటరితనం ఆవహించినట్టు అనిపించాక జయ మీద చాలా ప్రేమ పేరుకు పోయింది. ఒక్క క్షణం నిట్టూర్చి, పక్క మీంచి లేచి పనులన్నీ చూసుకొని పరంధామయ్యగారింటికి పయనమయ్యాడు. పరంధామయ్య కూడా ప్రకాశరావుతో పాటే షిప్‌యార్డ్‌లో పనిచేసి గవర్నమెంటిచ్చిన గోల్డెన్ షేక్‌హేండ్ తీసుకొని షాకయినవాడే! కరెంటుషాకు మించిన షాకు, అందుకే తేరుకోలేకపోయి కబుర్లకి రమ్మని, ధైర్యం చెప్పమని కబురు.... ప్రకాశరావు పగలే గనుక ఇంటికి తాళం వేసి పరంధామయ్య ఇల్లు చేరాడు.

పిల్లలూ వారి భవిష్యత్తూ- రేపటి జీవితం, మారుతున్న కాలం... వీటి దూరాల్ని కొలిచేసరికి మధ్యాహ్నమయింది.

"ప్రకాశం! మాచెల్లి లేదుగదా, మగాడివి నువ్వేం వండుకుంటావ్... ఈ నాల్రోజులు ఇక్కడే వుండరాదూ? పోనీ భోజనానికయినా వచ్చివెళ్తుండు"... పరంధామయ్య మాటే అతని భార్య కూడా అంది.

నాల్రోజులు కాదుగాని ఆ వారం మొత్తంలో రెండ్రోజులు పరంధామయ్యగారి ఇంట భోజనం! కాలం గడిచి గట్టెక్కిపోయింది. 'పరంధామయ్యే గాని ఈ సీతారామయ్య లేడనుకున్నావా?' అని కోపించి శాపించబోయిన మిత్రుడి ఇంట రోజున్నర తిండి గడిచిపోయింది... "అంటే ఆలింటా ఈలింటా తింటావు గాని ఈరకాడింటికి రాడానికి

నీకు ఇదయిపోయింది(?)రా" అంటే వారింట ఓరోజు. "నీకు తోడబుట్టిందాన్ని కాకపోయినా .... పిన్నమ్మ కూతురు ఊర్లో వుండనీసి... ఇలాటప్పుడు కాపోతే మరెలాటప్పుడురా చుట్టాలూ బంధుత్వాలు". బలవంతం చేస్తే రొండు పూటలు అతిధి భోజనాలయి అన్నిరకాలు తిని మొహం మొత్తి అజీర్తిలా అయికూచుంటే.. అలిగి కూర్చున్నట్టు జయమ్మ వచ్చేస్తుందని ఇరుగూ పొరుగూ అప్పుడప్పుడూ అన్నం పంపేవారు. ఆ తర్వాత హోటలు....

ప్రకాశరావుకి ఈ తిరుగుళ్ళు మరుగుళ్ళ వల్ల బట్టలు చాలా వేగిరం మాసిపోయాయి. ఆకలికి భోజనం పెట్టినట్టే, మాసిన బట్టలు ఎవరైనా వచ్చో.... పిలిచో ఉతుకుతారన్న ఊహ రాలేదు. ఊహల్లోకి జయ వచ్చింది. చెమట పట్టిన బట్టల్ని చూస్తే.... పోగులను చూస్తే.... జయ వెళ్ళి చాలా రోజులయిందనుకున్నాడు. ఉత్తరం రాయాలనుకున్నాడు. ఉత్తరం రానూపోనూ నాల్రోజులు.. లాభంలేదు... నాలుగ్గంటలు కూడా భరించలేనని అనుకున్నాక ప్రకాశం "స్టార్ట్ ఇమీడియట్లీ జయా" అని టెలిగ్రామ్ కొట్టాడు.

సినిమాలకు వెళ్ళాడు.

చిన్న చిన్న మందుపార్టీలకు వెళ్ళాడు.

ప్రకాశరావుకి ప్రశాంతంగానే గడుస్తున్నా, కష్టాలేవో కూడా వున్నాయని... వాటిని జయ వస్తే చెప్పడానికని కంఠస్థం చేసుకున్నాడు.

★ ★ ★

జయ వంటచేసింది. అలా వంట చేయడం ఆ పూటే కాదు, రోజుకు వుండే రొండు పూటలు కూడా! పుట్టిన దగ్గర్నుంచీ అంటే.... కుండ ఎత్తిదించగలిగిన వయసు నుండి మనుమల్ని చూస్తున్న ఈ వయసుదాక అదేస్థితి. అయితే స్త్రీజాతికి రాకూడని విసుగు జయకొచ్చింది. వంటమీద విసుగొచ్చింది. అది జీవితమ్మీద వచ్చినా ఫరవాలేదు. ప్రకాశరావనే పెనిమిటికీ విషయం తెలిస్తే.... ? తెలియనీ, ఆయన లేకపోవడం వల్ల - ఒక్కదానికోసం వండుకోవడం వల్ల... ఎవరికైనా వంటచేసి పెట్టే బాధ్యత బాదరబందీ లేకపోవడం వల్ల- తనకోసం తనే వండుకోవలసి రావడం వల్ల వచ్చింది... ప్రకాశరావు మనవరాల్ని చూడ్డానికి వెళ్ళడం వల్ల వచ్చింది.

జయకి అన్నం వండుదామని అనిపించలేదు కాని ఇంతవరకూ పొయ్యి ముట్టించుకొని వండీ వార్చుకోని రోజులేదే అనిపించింది. దాదాపు యాభై ఏళ్ళకి దగ్గరపడుతున్నా వంట అవసరం లేని రోజు (రా)లేదు. చిన్నప్పట్నుంచి అందరిళ్ళల్లో లాగే ఆడపిల్లకు చదువొచ్చినా

రాకపోయినా ఫరవాలేదుగాని వంట వచ్చితీరాలి అని తీర్మానించారు. అమ్మమ్మ అదే చెప్పింది.అమ్మ అదే చెప్పింది. (జయ) తనూ తనపిల్లలకి అదే చెప్పింది. చిన్నప్పుడు అమ్మకి సాయం... పెద్దయ్యాక అత్తకు సాయం.... ముసలయ్యాక కూడా అదే వ్యవసాయం! కాపురానికి వచ్చాక కంటిన్యూ అయింది. పెళ్లిళ్ళకో... దూరాబారం చుట్టపుచూపుకో వెళ్ళినా సరే వంట తప్పేది కాదు. ఇదిగో ఇప్పుడూ తప్పలేదు. చచ్చినట్టు వండుకుంది.

అలవాటుగా పెనిమిటికి పెట్టినట్టు పెట్టి, ఆయన ఊరెళ్ళడం గుర్తుకు వచ్చి జయే కంచం ముందు కూర్చుంది. రెండు ముద్దలు తిన్నాక ఎక్కిళ్ళు వచ్చాయి. 'మంచినీళ్ళు... నీళ్ళు పెట్టడం తెలీదా?' కదలకుండా నోరు కదిపితేనే, ప్రకాశానికి పరుగున వెళ్ళి అందివ్వడం గుర్తుకు వచ్చింది. తిండి దగ్గర్నుండి లేవడం కష్టమయినా అలవాటుగా లేచి నీళ్ళు తనే తెచ్చిపెట్టుకుంది. తిన్నాక సత్తువ వచ్చింది. సత్తువ వచ్చాక లేచి అంట్లు తోమింది. తోముతుంటే భుజాలు నొప్పెట్టాయి. కూతురి పురిటికెళ్ళి వచ్చాక నిలువా వుంచిన అంట్లన్నీ తోమింది. అప్పుడు నొప్పి మొదలయింది. అలవాటయిన భుజాలు అప్పుడప్పుడూ ఎందుకలా అవుతాయో! అనుకుంది.

ప్రకాశరావు కూతురింటికి బయలుదేరిన్నాడు వేకువన మూడుగంటలకి లేచి పిండివంటలు చేసింది. ముందురోజు తిరిగివచ్చిన ప్రయాణ బడలికలోనే చేసింది. మనుమలకి ఇష్టమని చెప్పి కట్టింది. రైల్లో తిండికని ప్రకాశరావు కోసం పులిహోర చేసింది. ఇంకేవో చేసింది. ఏ నీళ్ళు పడితే ఆ నీళ్ళు తాగితే జలుబు చేస్తుందని మరిగించిన మంచినీళ్ళు చల్లారబెట్టి సీసాతో పెట్టింది. అన్నీ బేగుల్లో సర్దింది. ఆయన వెళ్ళారు, వెళ్ళాక మిగిలిన అంట్లుతో కుస్తీ పడింది.

జయ ఊరెళ్తూ ప్రకాశరావు వంటకి ఏ ఇబ్బందీ పడకూడదని చెప్పి టమాటాలు వుంచింది. వంకాయ బంగాళదుంపలాంటి కూరలనేకం వుంచింది. వుక్కురుగాని ఇంకెలాగ గాని వండుకున్నా సులువుగా వేగంగా చేసుకునేవి గుడ్లు మాత్రమేనని అరడజను తెప్పించి పెట్టింది. వెళ్ళే ముందు చెప్పింది. అయినా ఈ పదిరోజులూ పొయ్యి వెలగలేదు. తాళింపు వేగలేదు. కూరలు వాడిపోలేదు, కుళ్ళిపోయాయి. గుడ్లు పిల్లలవలేదు, కరిగిపోయాయి. జయ అవన్నీ పెంటమీద పోసి వచ్చింది. జయకు కోపం వచ్చింది. వంట చేసుకోకుండా ఆలింటా ఈలింటా పడి అడుక్కున్న వాళ్ళలా.... అతీగతీలేక అంగట్లో హోటల్లో తిరిగి తినొచ్చినందుకు కాదు, తను వచ్చినందుకు, తనని రప్పించినందుకు, టెలిగ్రామ్ ఇచ్చినందుకు.

మనవరాలికి అయిదు రోజులు నీళ్ళయినా పోయకముందే జయ బయలుదేరింది. నాల్రోజులుంటే బాగున్నని కూతురు మొత్తుకుంది. కాని టెలిగ్రామ్! ఏమయిందో ఎద్దయిందోనని బెంగపడి కునుకుపడక ఇల్లు చేరింది.తీరా చూస్తే ముందురోజు మందు పార్టీ మత్తు దిగనట్టే ప్రకాశరావు మాట్లాడేడు.

"నువ్వెళ్ళి అక్కడ కూర్చుంటే ఇక్కడ పొద్దెలా గడుస్తుంది?" ప్రకాశరావు మాటవిన్న జయ వయసులో అయితే ఇంకోలా అర్థం చేసుకునేదే గాని, ఇప్పుడు ఒకేలా అర్థం చేసుకుంది. సూర్యచంద్రులు పొడుస్తూనే వుంటే, పొద్దుగడవక పోవడమేమిటి అందుకే అర్థం కాకపోయినట్టే అదే విషయం అడిగింది.

ప్రకాశరావు అంట్లు అన్నాడు. అన్నం అన్నాడు. మాసిన బట్టలన్నాడు. మాసిన బట్టలని జ్ఞాపకం రాగానే అంట్లపని పూర్తిచేసి వాటిమీద పడింది జయ. సబ్బు పెట్టడానికో పూట... ఉతకడానికి మరో పూట... కాలం గడిచిపోయింది. వళ్ళు అలసిపోయింది. పొద్దున అన్నమే రాత్రికీ తిని నిద్రపోయింది.

రాత్రి చీకట్లు చెదిరిపోయి తెల్లవారింది.

జయ నిద్రలేచింది. వంటరితనం ఆవహించినట్టనిపించినా సరే, 'పనులన్నీ పడుకున్నాయి, నువ్వింకలేఁ.....' అని ఎవ్వరూ అనేవారు లేకపోవడంతో హాయిగా అరగంట అటూ ఇటూ దొర్లింది. తరువాత ఆకాశంలోకి అంటే ఆ ఇంటిపై కప్పుకేసి చూసింది. పట్లు పట్టివున్నాయి. సాలీళ్ళూ సంసారం! సంసారంలో చిక్కుకున్న సాలీళ్ళూ.....

బద్దకంలాంటి హాయి చాన్నాళ్ళకు పొందినా సరే, వెంటనే లేచి జయ తక్షణ కర్తవ్యంగా వాట్ని దులిపింది. వస్తువులన్నీ తుడవక రంగు మార్చుకుంటూ వుంటే వాట్ని యథారంగుల్లోకి తెచ్చింది. ఆ తర్వాత ఇల్లు కడిగింది. వాకిలి తుడిచింది. మసి గుడ్డలు పులిమింది. 'ఇంటికి దీపం ఇల్లాలు' అని ప్రకాశరావు తనని పొగడడం గుర్తుకు వచ్చింది. పొగడడం వల్ల ఈ ఇల్లాలికి వళ్ళంత పులకించిపోలేదు. పచ్చి పుండయిపోయింది. పనులన్నీ చేయడం వల్ల.ప్రతి అవయవమూ సలుపుకు గురయిపోయింది.

ఇంటిపనులన్నీ చేసుకున్నాక వంటపని చేసుకోలేక పోయింది. నడుం నొప్పికి కూర్చోలేక మంచం మీద చారబడితే, వెంకటి వాళ్ళమ్మ వెంకటరత్నం వచ్చింది. జయలేచి కూర్చుంది.

కూతురు పురుడూ పుణ్ణెం కబుర్లు అడిగాక.... "అయితే మా అన్నయ్య వచ్చిందాక వక్కదానివే నన్నమాట. పోన్లే మగాళ్ళుంటే ఈకూర ఆకూర అని పట్టింపు. మసాలాల

దబ్టింపు... మనమా ఆడవాళ్ళం... ఏది వండుకున్నా చెల్లిపోద్ది, కాలం గడిచిపోద్ది... ఏమంటావ్ వదినా?'' అంది వెంకటరత్నం.... జయ ఏమీ అనలేకపోయింది. అయినా ఆవిడ పట్టించుకున్నట్టులేదు, అందుకే మళ్ళీ అంది... "మగమనుషులుంటే బేజారు కంగారు. ఇప్పుడు తాపీమీద పన్లు చేసుకోవచ్చు. నచ్చింది ఎంచక్కా వండుకోవచ్చు....''

వెంకటరత్నం జయకు స్వాతంత్ర్యం వచ్చినట్టే మాట్లాడి పొయ్యిమీద కూర ఏమయ్యిందోనని తనకింకా స్వాతంత్ర్యం రానట్టే పరుగుతీసింది.

జయ వండుదామా, వద్దా అని తేల్చుకొనేసరికే మధ్యాహ్నం రెండున్నర అయింది, అరగంట ఆగితే మూడయింది. ఆకల్ని టీతో సరిపెట్టుకుని, రాత్రికి వండుకోవచ్చని అనుకుని నిద్రపోయింది. లేచి చూస్తే చీకటి పడుతోంది. ఆకలి బాగా వేస్తోంది. నీరసం మరీ ఎక్కువగా వుంది.

హోటల్‌కు పోతేనో....? ఏవిఁటి ఆడకూతురయివుండి కూడా వండుకోక హోటల్‌కు పోవడమా? ఎక్కడయినా ఇలా వుందా? జరిగిందా? నలుగురూ నవ్వరూ?... ఎంతో అప్రతిష్ట వచ్చినట్టే బెంగపడిపోయింది జయ. ఆ ఆలోచనకే బెంబేలుపడిపోయింది. అందుకే శిక్షగా ఓపికగా వంట చేసుకుంది.

"వేరీగుడ్ నువ్వూ ఆడదానివంటే, అర్ధాంగివంటే !....'' ప్రకాశం పొగిడాడు ఫ్రేముకట్టించిన పెళ్ళినాటి ఫోటోలోనుంచి ఫోజుకొడుతూ-

ఆ రాత్రే కాదు... ప్రతీరాత్రి రోజులు లెక్కపెడుతూనే వుంది. ప్రకాశం రాలేదని కాదు మనవరాలినెప్పుడు ఉయ్యాల్లో వేస్తారోనని!

ఆవాళ పరంధామయ్యగారింటికి వెళ్ళింది జయ. ఆ పెనిమిటి పెళ్లాలు కుశలమడిగారు. వంటయిపోయిందా? అని అడిగారు. ఒక్కదాని వెందుకు చేసుకుంటావని గాని ఏమిటి చేసుకుంటావని గాని అడగలేదు. భోంచెయ్యమన్నారు. ముందున 'టీ' గ్లాసు పెట్టారు. తనిప్పుడు ఒంటరి అయింది ఎలా వుంటాదోనని జయమీద జాలి చూపించలేదు . పాపం ప్రకాశరావు చాలా ఇబ్బంది పడ్డాడని, పాత రోజుల్ని గుర్తుకు తెచ్చుకొని ఆ దంపతులు బాధ పడ్డారు. జయకేదో బోధపడ్డది!

సీతారామయ్య వాళ్ళు 'మా ఇంటికి రాలేదేం?' అని అనకపోయినా జయ వెళ్ళింది. వెళ్ళాక సీతారామయ్య పెళ్ళాం "జయమ్మా నీచేత్తో పచ్చడి పెడుదూ? బాగుంటాది. ఆడపిల్లల్లేని ఇళ్ళని తెలుసుగా, సమయానికొచ్చావ్....'' అంటే, అలవాటుగా పనిచేసింది. ఆ తర్వాత 'అందరికీ పచ్చళ్ళూ అవీ పెడతావ్, ఈ ఊరకత్తె తలపుకి రాలేదే నీకు'

దెబ్బలాడి జయతో పెట్టించుకుంది. "ప్రమీల పెళ్ళి, లడ్డూలు చెయ్యవా...." అనీసి చేయించేసుకుంది ప్రకాశం పిన్నికూతురు.

'తిన్నావా తిన్లేదా?' అని అడిగినా రెండుపూటలే ఈ వారం పదిరోజులకీ పరాయింట్లో తిన్నది. అప్పుడు అందరూ 'ప్రకాశం పాపం ఏమి వండుకొనేవాడో' వాపోయినవారే! ఇరుగూ పొరుగూ అన్నం పంపకపోయినా అప్పడాలు... వడియాలు అగడం బుగడం చేసినందుకు కాసిన్ని ఇచ్చారు. వాటితో జయ ఆకలి తీరలేదు.

వెంకటిని కేరియర్ హోటల్ నుండి తెమ్మంటే... నవ్వేసాడు. మామూలుగా కాదు, పగలబడి మరీ .... పదిమందికీ పెద్దజోకులా చెప్పాడు. జయకు మొదట సిగ్గనిపించింది. ఆలోచిస్తే ఆశ్చర్యమనిపించింది. మళ్ళీ ఆకలీ అనిపించింది. హోటల్‌దాక వెళ్ళింది. అందరూ మగాళ్లే! ఆడాళ్ళున్నా మగవాళ్ళకెనకాతల వున్నారు. వుండనీ అనిపించి, పట్టుదలగా ఒక్కర్తీ వెళ్ళి కూర్చుంది. మీల్స్ చెప్పింది. అందరూ చూస్తున్నారు. కొందరు పట్టించుకుంటున్నారు. తెలిసిన వారెవరో ముక్కున వేలేసుకున్నారు. తప్పుచేస్తున్నట్టు చూపులు. ఆకలి వున్నాసరే... తినలేకపోయి... అక్కడ వుండలేకపోయి... ఇల్లు చేరి అర్ధాకలితో కన్నా జరగరానిది జరిగినట్టుగా చాలాసేపు నిద్రపోకుండా వుండిపోయింది.

మరుసటి రోజు ఉదయానికే జ్వరం వచ్చింది. వల్లు నొప్పుల మీదన కమ్ముకు వచ్చిందేమో ఆ జ్వరాన్ని భరించడం జయకు కష్టంగా వుంది. లేచి కూర్చోవడం కష్టమయిపోయింది. వీధిలోంచి పేరుపెట్టి ఇరుగూ పొరుగూ పిలుస్తుంటే అతికష్టం మీద వాకిట్లోకి నడిచింది.

అప్పటికే వెంకటరత్నం, నాయుడు పెళ్ళాం అంతా - సెలక్టు చేసిన లక్కపిడతల సెట్ వుంచారు. "తీసుకో జయా... నీ మనవరాళ్ళు ఆడుకుందికి" అన్నారు. చాలా బావున్నాయి అన్నారు. తయారీని మెచ్చుకున్నారు.

పొయ్యి, తపేలా, బిందే, గ్లాసు, తిరగళి, రోలూ రోకలి, దస్త్రా, గూటాము, కత్తిపీట, కడవ, అప్పడాల కర్ర, పెనుము సమస్తము రంగుల్లో ముద్దొచ్చేటట్టున్నాయి. జయకు కూడా ముచ్చటేసింది. డబ్బులిచ్చి తీసుకుంది. మనవరాళ్ళకోసం పంపాలనుకుంది.

ఈ రెండ్రోజుల్లో జయకొచ్చిన జ్వరం రెట్టింపయింది. నీరసం కూడా, ఒళ్ళేకాదు ఎముకలూ నొప్పే... సలుపే...

డాక్టర్ల ప్రయత్నం డాక్టర్లు చేస్తున్నారు.

"ప్రకాశం స్టార్ట్ ఇమీడియట్లీ" టెలిగ్రామ్!

జయ ఆఖరు దశ అదే అన్నట్లు మంచం పట్టేసింది.

★ ★ ★

"నేను మీనాన్న కన్నా ముందుపోవాలి" చావుని గురించి తన కోరికగా జయ వణుకుతున్న పెదాలతో చెప్పింది.

జయ మంచం మీద కదలిక లేని కట్టెబొమ్మలా వుంది. కనురెప్పలు మాత్రం ఇంకా బతికే వుందన్నట్లు టపటపా కొట్టుకుంటున్నాయి. ఆమె చూపు- మంచం చుట్టూ చేరిన తన బిడ్డలతో అంటే... కొడుకులతో వారి పెళ్ళాలతో వారి వారి పిల్లలతో అల్లుకుపోయింది. అతుక్కు పోయింది. అందుకే హృదయాంతరాలంలో ఎక్కడో మూలనవుండి, ఎన్నాళ్ళుగానో వుండి మగ్గిపోయిన మాటని బుగ్గయిపోయే ముందు అందరిముందూ పెట్టింది.

అందరికీ అక్కడ చేరిన అంతమందికీ ఒకటే అర్థమయింది. ఏ ఆడదయినా కోరుకునేది అంతే అనుకున్నారు. అవే పసుపు కుంకుమలనుకున్నారు. అయిదవతనమే అతివకు కావల్సింది అనుకున్నారు. జయ కోరుకుంటున్నదీ ఇప్పుడు మాట్లాడుతున్నదీ - అదే అనుకున్నారు.

ప్రకాశరావు జయ రోగానికి బాధపడ్డా ఆమెలోని గొప్పమనసుకు చాలా సంతోషించాడు. ఎందుకంటే తనూ అదే అనుకున్నాడు.

పురిటికందుని ఎత్తుకొని కూతురూ వచ్చింది.

కొడుకుల సంతానం. కూతురు సంతానం - మనమలూ మనుమరాళ్ళూ ఇల్లు నిండిపోయింది. వాళ్ళని చూస్తే జయకు మనసు నిండిపోయింది. అంతలోనే మనవరాళ్ళని చూస్తే గుండె తరుక్కుపోయింది. కళ్ళంట నీళ్ళు బొట్లు బొట్లుగా మొదలై ధార కట్టాయి.

జయ తట్టుకోలేక దృష్టి మరల్చుకుంది.

ఎదురుగా లక్కపిడతలు!

అందంగావున్నా, అసహ్యంగా తోచాయి! వాటిని మనవరాళ్ళకని కొన్నా ఇవ్వలేదు, ఇవ్వాలనీ అనిపించలేదు.

ఈలోగ పెద్దకోడలు పసుపురాస్తే, చిన్నకోడలు కుంకుమబొట్టు పెద్దది పెట్టింది. తన తల్లి కోరుకుంటున్నవేనని కూతురు బాధపడుతున్నా, తల్లి.... 'తండ్రి చేతులమీదగా పోవడం ఎంత అదృష్టం....' అని గర్వపడింది.

జయ తానింకా బతికివున్నానన్నట్టు తెరలు తెరలుగా దగ్గింది. ప్రేవులు తెగిపోయేలా దగ్గింది.

ప్రకాశరావు చాలా డీలాపడిపోయాడు.

వంటరిగా గడపలోకెళ్ళి కూర్చున్నాడు. అతగాడికి అతగాడి మిత్రుడు ఆనందరావు జ్ఞాపకానికొచ్చాడు. అతగాని దిక్కులేని చావు.... దీనమైన చావు జ్ఞాపకానికొచ్చింది. అతగాని పెళ్ళాం జ్ఞాపకానికొచ్చింది. పెళ్ళాం వున్నన్నాళ్ళు బాగా పెట్టేది గనుక ఆరోగ్యంగా వున్న ఆనందరావు, అర్ధాంగిపోయాక బియ్యం పొంగించేవారు లేక, వేళకు తినమనేవారు లేక - చివరకి పిల్లలింట చేరి, వంతులుపడి, నోరూరే పదార్థాలకు వాయిదాలుపడి - కాష్టంలో కట్టెలయికాలి, మట్టిలో మట్టయి పోయాడు.

ప్రకాశరావుకి భయమేసింది.

జయ నిద్ర రాకపోయినా కళ్ళు మూసుకుంది. మూసుకున్న కళ్ళవెనుక ముడులు పడుతుంటే విప్పుకుంటోంది.

"అమ్మా నువ్వు నాదగ్గరుండు...."

"నాదగ్గరకి వచ్చేయమ్మా...."

కొడుకులు పోటీపడ్డారు.

"నీ కోడలుకి ఏం తెలీదు కదా, దార్లో పెట్టొచ్చు. వంట నేర్పొచ్చు. అయినా దాని మొఖం దాని వంట బాగోదు, దానికసలు వంటరాదు, వంట అంటే నీదే... తనూ అదే అంటుందిలే, నువ్వు వండితే వంకాయయినా మాంసంలా వుంటుంది. గుడ్లు పులుసు నువ్వే చేయాలీ బూమ్మీద...."

"నీ మనుమలుకి మా కంటే నువ్వంటేనే ఇష్టం. నీక్కూడా వాళ్ళంటే ప్రాణం, నువ్వు నీ దగ్గర వదిలెయ్యమంటావు, వారి చదువులో....? కాబట్టి నువ్వే వస్తే నీ అచ్చటా తీరుతుంది, వాళ్ళకి జడలు వెయ్యొచ్చు, స్నానాలు చెయ్యించొచ్చు. దానికి చిన్న పిల్లలకి నీళ్ళు పొయ్యడం రాదు, ఉక్కిరి బిక్కిరి అయిపోతారు. నాకే భయం వేస్తుంది. నువ్వయితే మాకు నలుగు పెట్టేదానివి, మా పిల్లలు దురదృష్ట వంతులు...."

గతమంతా తవ్వుకుంది జయ!

ప్రకాశరావుని తలచుకుంది, కుమిలిపోలేదు. ధైర్యంగా వుండిపోయింది.

బతుక్కి భద్రత కోల్పోయినట్టే ప్రకాశరావు అక్కడా తచ్చాడి చివరకు జయ మంచం

దగ్గరకు చేరాడు. జయ గమనించిందో లేదో అతనికి తెలియదు. అయినా అలానే కూర్చున్నాడు.

జయ లక్కపిడతలనే చూస్తూవుంది.

ప్రకాశరావు అది గ్రహించాడు.

కొడుకులూ కూతురూ... కోడళ్ళూ మంచం చుట్టూ కూర్చున్నారు.

మనుమలంతా ఆడుకుంటూవున్నా, వారి దృష్టి బీరువాలో గల లక్కపిడతల మీద పడింది. ఆడపిల్లలు ఆసక్తి చూపారు. 'తాతయ్యా' అన్నారు. ప్రకాశరావు అది విన్నాడు. అర్థం చేసుకున్నాడు.

"మీకోసమేగ్రా మీ ముసిలమ్మ కొంది..."

ప్రకాశరావు లేచి వెళ్ళి వాట్ని అందుకుని ఇవ్వబోయాడు.

"వద్దు.... వద్దు" అయోమయంగా కేకలు పెట్టింది జయ. ప్రకాశరావు ఆగిపోయాడు.మనుమలుతో పాటు కోడళ్ళకీ కూతురుకీ కొడుకులకీ ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. ఎందుకు కేక పెట్టిందో అర్థం కాలేదు.

కొద్దిసేపు నిశ్శబ్దం-

జయ కళ్ళతోనే మనుమరాళ్ళని దగ్గరకు పిల్చి అక్కున చేర్చుకుంది. ప్రేమగా లాలనతో వాళ్ళ వంటిని తడిమింది. ముద్దులాడింది ఎక్కడపడితే అక్కడ. వస్తున్న దగ్గుని ఆపుకొని మాట్లాడడానికి ప్రయత్నించింది.

"..... వద్దమ్మల్లారా, ఈ ఆడపుటుక్కి ఆ లక్క పిడతలు చచ్చినదాక వదలవు. పెద్దయ్యాకవి ఇప్పుడున్నంత ముద్దుగా వుండవు. పెద్దగా వుంటాయి. ఎత్తలేనంత బరువుగా వుంటాయి. రోజూ వాటితోనే ఆడుకోవాలి. అవి కాలి, మసి బారిపోతున్నట్టే మనమూ మసిబారిపోవాలి. చివరకు అంచుపోయో... కన్నంపడో లొత్తలుబారో... పనికి రాకుండా పోతాయి. కణకణ మండుతున్న కొలిమిలో కరిగించడానికి తప్ప..." జయ చెప్పి ఎందుకో ఆగిపోయింది.

ఆ పసివాళ్ళకు అర్థం అయీకాకుండా వుంది.

ప్రకాశరావు ఏ లోకాన వున్నాడో ఏమో....

ఎలాంటి స్థితిలో విన్నాడో ఏమో....కొద్దిగా అర్థమయినా ఎక్కువ ఆలోచించలేక పోయాడు. అసలుకి జయ దక్కని స్థితిలోనో ... జ్వరం తీవ్రత్తో - పలవరిస్తోందో .... పలవరింపు పేలాపన ఏమోననీ అనుమానమొచ్చింది.

"నువ్వు బతకాలి జయా....." తనలో తను అనుకున్నాడని అనుకున్నాడేగాని ప్రకాశరావు ఆమాట పైకే అన్నాడు.

జయ ఆ మాటవిని అడ్డంగా తలూపి "లేదు ... లేదండీ ... నేను మీకన్నా ముందు పోవాలి, ఇప్పుడే కాదు ఎప్పుడయినా ..." చలికి వణుకుతున్నట్టుగానే ఆమె పెదవులు వణుకుతున్నాయి.

"అవేం మాటలు"? ప్రకాశరావన్నాడు.

"మగవాళ్ళకన్నా ఆడవాళ్ళే ముందు పోవాలి...." జయ మళ్ళీ అంది. ఈ దఫా పసుపు కుంకుమ 'అయిదవతనం' అనే వాటిగురించి, 'సుమంగళి'గా పోవడం గురించి జయ మాట్లాడుతుందనుకున్నారంతా.

"....పసుపుకుంకుమలతోపోతే 'పుణ్యస్త్రీ' నవుతాననీ .... పుణ్యం మూటగట్టుకు మోసుకుపోతాననీ పోవాలనీ కాదు, వాటిమీద నమ్మకం సంగతి అటుంచి చెప్తున్నాను. నేనుపోతే ... మీకన్నా ముందుపోతే నా కష్టాలు నాతోటే పోతాయి. బతికున్నన్నాళ్ళూ బానిసను. పుట్టిన కుటుంబంలో వయసొచ్చినదాక బానిసను. వయసొచ్చి పెళ్ళయ్యాక నీకూ నీఇంటికీ బానిసను. ముసలయాక కూడ తీరలేదు. ఇప్పుడు పిల్లల పిల్లలకి బానిసను. నువుపోయి, నే మిగిలిపోతే ఏ కొడుకింట వున్నా కూతురింటవున్నా వాళ్ళ చాకిరీ అంత చేస్తే ఇంత తిండి పడేస్తారు. అందుకే రమ్మంటారు. అదే నేను పోయి నువ్వుండిపోయినా బాధలేదు. నువ్వు మగాడివి. మగమనిషివి, కాబట్టి తిట్టో దీవించో... ముక్కులుకోనో మూలుక్కోనో వేళకింత పడేస్తారన్న ధైర్యం నాకుంది. అదే నా చావు వెనకాలైపోతే కుక్కకన్నా హీనమైపోతాది బతుకు... నాకు చావొస్తే బాగున్ను...." గుండెల్లో ఇన్నాళ్ళూ ఇంకిపోయిన బాధంతా పూర్తిగా చెప్పలేకపోయినా, చాలావరకు బయట పెట్టింది జయ.

జయకి దుఃఖం తగ్గింది. అందరూ కొయ్యబారిపోయి నిల్చుంటే, అందరి చలనమూ తనలో జ్వలించినట్లు... సత్తువ చేకూరినట్లు... లేచి కూర్చుంది. అందుకు మనమలంతా సాయపడ్డారు. సాయపడ్డ వారందరికీ ఒక్కో ముద్దు ఇచ్చింది.

*రచన : 2-10-94*

*ప్రచురణ : ఆహ్వానం, సెప్టెంబర్ '95*